







సిరులు కురిపించు శ్రావణలక్ష్మి

శ్రావణ శుక్రవారం సందర్భంగా సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా ఆలయాలు కిటకిటలాడాయి. ఇళ్లలోనూ వ్రతాన్ని ఆచరించారు. అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూలు, ఆభరణాలతో అందంగా అలంకరించారు. పండ్లు, పిండి వంటలతో నైవేద్యాలు సమర్పించారు. అనంతరం మహిళలు ఒకరికొకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

-న్యూస్ నెట్‌వర్క్ (ఆంధ్రజ్యోతి)





బ్యాంకులో సీసీ కెమెరాల్లో దొంగలు

మెదక్ ఎస్‌బీఐలో చోరీకి యత్నం

మెదక్ అర్బన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఆటోనగర్ ఎస్‌బీఐ బ్యాంకులో శుక్రవారం దొంగలు చోరీకి యత్నించారు. మంకీ క్యాంపు ధరించిన ఇద్దరు దొంగలు బిల్డింగ్ పైభాగం నుంచి లోనికి వెళ్లారు. స్ట్రాంగ్ రూం తెరిచేందుకు ప్రయత్నం చేయగా సాధ్యం కాకపోవడంతో వెళ్లిపోయారు. స్లీపర్ స్ట్రాంగ్‌రూం వద్ద గోడను పగలగొట్టినట్లు ఉండడంతో బ్యాంకు అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, పట్టణ సీఐ మహేష్ బ్యాంకు వెళ్లి పరిశీలించారు. బ్యాంకులో జరిగిన ఘటన అంత సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. సీసీ పుటేజ్‌లను పరిశీలించారు. దొంగలు మంకీ క్యాపులు ధరించారు. సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రాఖీ సందడి

సిద్దిపేట.. రాఖీల తోట

పట్టణ కేంద్రంగా తయారీ

చైనా, రాజ్‌కోట్ నుంచి ముడిసరుకులు

ఇతర రాష్ట్రాలకు సైతం ఇక్కడి నుంచే సరఫరా

రూపాయి నుంచి రూ.10వేల రాఖీలు కూడా అందుబాటులో

7

సింగూరు డేంజర్ బెల్స్..!

ఎప్పుడేం జరుగుతుందో..

ప్రమాదం అంచున ప్రాజెక్టు

మరమ్మతులు లేక.. భద్రత కరువు

ముందే హెచ్చరించిన 'ఆంధ్రజ్యోతి'

అయినా.. కళ్లు తెరవని అధికారులు, యంత్రాంగం

డ్యామ్‌సేఫ్టీ బృందం పర్యటనతో లోపాలు తేటతెల్లం



సింగూరు రిజర్వాయర్ కట్టకు మొక్కుబడిగా రక్షణగా అమర్చిన కంకర చిప్స్ బస్తాలు

సింగూరు రిజర్వాయర్‌కు ప్రమాదం పొంచి ఉందా? మంజీర నదికి వస్తున్న వరద ప్రవాహాన్ని తట్టుకునే శక్తి లేదా? మరమ్మతులు చేయకపోవడంతో గండి పడే అవకాశాలున్నాయా? సామర్థ్యానికి మించి నీటిని నిల్వ చేయడం వల్ల లీకేజీలు ఏర్పడ్డాయా? వరద ముప్పు నేపథ్యంలో ప్రాజెక్టుకు భద్రత కరువైందా? పలుమార్లు హెచ్చరికలు ఉన్నా ఇంజనీరింగ్ అధికారులు, అధికార యంత్రాంగం పట్టించుకోలేదా? అనే ప్రశ్నలకు అవును అనే సమాధానం వ్యక్తమవుతోంది. సాగునీటి ప్రాజెక్టులు, ఆనకట్టల భద్రత మండలి సభ్యులు ఇటీవల సింగూరు ప్రాజెక్టును సందర్శించడంతో లోపాలన్నీ బట్టబయలయ్యాయి. అయితే, శుక్రవారం రాష్ట్ర నీటి పారుదల శాఖ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ అంజద్ హుస్సేన్ (జనరల్) సింగూరు ప్రాజెక్ట్‌ను సందర్శించారు. ప్రాజెక్ట్‌కు ఇప్పటికిప్పుడు ప్రమాదం ఏమీ లేదంటూనే, జాగ్రత్త పడాల్సిందేనని పేర్కొనడం గమనార్హం.

సంగారెడ్డి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి మెదక్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల సాగునీటి అవసరాలతోపాటు హైదరాబాద్‌కు తాగునీటి కష్టాలు తీరుస్తున్న సింగూరు రిజర్వాయర్‌కు రక్షణ కరువైంది. 29 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన ఈ రిజర్వాయర్ మంజీర నదిపై ఉంది. నదీ ప్రవాహాన్ని నియంత్రిస్తూ ఇక్కడ సరిపడా నీటిని నిల్వ చేయడమే ఈ ప్రాజెక్టు ఉద్దేశం. ఇక్కడి నుంచే మంజీరా బ్యారేజీతోపాటు ఘనపురంప్రాజెక్టు, నిజాంసాగర్ ప్రాజెక్టుకూ నీటిని తరలిస్తారు. మంజీర నదిలో ప్రవాహం ఉన్నన్ని రోజులూ ఈ రిజర్వాయర్ జల కళతో కనిపిస్తూ ఉంటుంది. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన సింగూరు ప్రాజెక్టు ప్రమాదంలో పడిందనే వార్తలు ఆందోళనను కలిగిస్తోంది.


ఆంధ్రజ్యోతి
సింగూరు ప్రాజెక్టు భద్రమేనా?

'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం

ముందే హెచ్చరించిన 'ఆంధ్రజ్యోతి'

సింగూరు ప్రాజెక్టుకు భద్రత కరువైందని, ప్రమాదపుటంచున నీటిని నిల్వ చేస్తున్నారని గత ఏడాది సెప్టెంబరు నెలలో 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ కథనం చర్చనీయాంశమైనా మొక్కుబడిగా చర్యలు చేపట్టి ముగించారు. అప్పుడు ఉన్న సమస్యలు ఇప్పటికీ అలాగే ఉన్నాయి. పైగా ఆనాడు రిజర్వాయర్ కట్ట లోపలి భాగంలో ఉన్న బుంగల వద్ద కొత్త ఇసుక, కాంక్రీట్ బస్తాలు అడ్డుగా వేశారు. కానీ నేడు కొత్త బస్తాలు కానరాలేదు. బుంగ ప్రాంతం ప్రమాదకరంగా కనిపిస్తోంది. ఎప్పుడేం ప్రమాదం ముంచుకొస్తుందో అన్నట్లుగా పరిస్థితి ఉంది. ఇక రిజర్వాయర్ గేట్ల లీకేజీల్లో ఏ మాత్రం మార్పు లేదు. ప్రాజెక్టు విద్యుత్ వ్యవస్థపైనా సందేహాలు ఉన్నాయని ముందే హెచ్చరించింది. దాదాపు ఏడాది సమయం కావొస్తున్నా ఎక్కడి సమస్యలు అక్కడే అన్నట్లుగా సింగూరు ప్రాజెక్టుపై పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లుగా దాపురించింది. ఆంధ్రజ్యోతి కథనంలో ప్రచురించిన అంశాలనే నేడు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అధికార బృందం కూడా ఎత్తిచూపడం గమనార్హం.

మంజీరా తరహాలోనే సింగూరు

డ్యామ్ సేఫ్టీ బృందం అధికారులు ఇటీవల మంజీర బ్యారేజీని సందర్శించి పిల్లర్లు ప్రమాదకరంగా ఉన్నాయని సూచించారు. దీంతో సాగునీటి పారుదలశాఖ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. మంజీరా బ్యారేజీలో మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. బ్యారేజీ గేట్ల దిగువ భాగంలో ఉన్న నిర్మాణాలు కూలిపోయాయి. దాదాపు 20 గేట్లు పనిచేయకుండా పోయినట్లుగా గుర్తించారు. ఎక్కడికక్కడ లీకేజీలతోపాటు గేట్ల పరిసరాల్లో పిచ్చిమొక్కలు, నాచు

మిగతా 8వ పేజీలో



మూడో కన్ను నీడలో

తరగతి గదులు

సంగారెడ్డి జిల్లాలో 20 జూనియర్ కాలేజీల్లో సీసీ కెమెరాలు

జోగిపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలు సీసీ కెమెరాల నిఘాలోకి రానున్నాయి. విద్యార్థుల హాజరు, అధ్యాపకుల విద్యాబోధనపై నిరంతర పర్యవేక్షణ కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నడుం బిగించింది. సంగారెడ్డి జిల్లాలో 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. జిల్లాకు 350కి పైగా కెమెరాలు కేటాయించారు. జోగిపేట-2, సంగారెడ్డి-2, పుల్కల్, సదాశివపేట, పటాన్‌చెరు, రామచంద్రాపురం, జిన్నారం, హత్నూర, కొండాపూర్, సదాశివపేట, బుధేరా, కోహీర్, జహీరాబాద్, న్యాల్‌కల్, హద్నూర్, కళాశాలల్లో ఇప్పటికే సీసీ కెమెరాలు బిగింపు పూర్తవగా, కల్హేర్, కంగ్టి కళాశాలల్లో పూర్తికావస్తోంది.

ఇంటర్మీడియేట్ బోర్డు పర్యవేక్షణ

జూనియర్ కళాశాలల్లోని తరగతి గదులు, ల్యాబ్‌లు, స్టాఫ్ రూం, ప్రిన్సిపాల్ గది, వరండా, కళాశాల ప్రాంగణం తదితర అవసరమైన ప్రాంతాల్లో ఒక్కో కళాశాలలో 10కి తక్కువ కాకుండా సీసీ కెమెరాలు బిగించనున్నారు. ఈ కెమెరాలను.. స్థానిక కళాశాలల్లోని అకాడమిక్ మానిటరింగ్ కమిటీలు, జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాశాఖాధికారితో పాటు నాంపల్లిలోని ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయంలో ఉన్న కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానిస్తారు. హైదరాబాద్ నుంచి అధికారులు, నిపుణులు తరగతుల నిర్వహణ అంశాలను పర్యవేక్షిస్తారు.

నిరంతరం నిఘా

గతంలో కొందరు అధ్యాపకులు కళాశాలలకు వచ్చినప్పటికీ.. పాఠాలు చెప్పకుండా స్టాఫ్ రూంలకే పరిమితమవుతున్నారన్న ఆరోపణలు కొన్నిచోట్ల వినిపించాయి. విద్యార్థులు కూడా కాలేజీకి తమ ఇష్టానుసారంగా వచ్చి వెళ్లిపోయేవారు. దీంతో హాజరు శాతం తక్కువగా ఉండడంతో పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం తక్కువగా ఉండేది. విద్యార్థుల గైర్హాజరు సమస్యను నియంత్రించేందుకు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్) అమలుతో ప్రతీ విద్యార్థి తప్పనిసరిగా ప్రతీ పీరియడ్‌లోనూ ఫేషియల్ రికగ్నిషన్ నమోదు చేయాల్సి ఉంది. గత సంవత్సరం వరకూ కేవలం ఇంటర్మీడియెట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు మాత్రమే.. సీసీ కెమెరాలను వాడేవారు. ఇప్పటి నుంచీ నిరంతరం సీసీ కెమెరాల పర్యవేక్షణ కొనసాగనున్నది. నిరంతర పర్యవేక్షణతో పారదర్శకత పెరుగుతుందని డీఐఈవో గోవింద్‌రామ్ పేర్కొన్నారు.



పంచాయతీ ఎన్నికలకు

వార్డులవారీగా ఓటరు జాబితా

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

హవేళిఘణపూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాబోయే పంచాయతీ ఎన్నికలకు వార్డులవారీగా ఓటరు జాబితాను తయారు చేస్తున్నట్లు మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఓటరు జాబితా తయారీ ప్రక్రియను శుక్రవారం ఆయన పరిశీలించారు. జిల్లాలోని అన్ని ఎంపీడీవో కార్యాలయాల్లో పంచాయతీ ఓటరు నమోదు మ్యాపింగ్ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ఒక కుటుంబం ఓట్లు ఒక వార్డు పరిధిలోనే ఉండేలా చూడాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. దూప్‌సింగ్ తండా వద్ద పారుతున్న గంగమ్మ వాగును పరిశీలించారు. ఆయనవెంట జడ్పీ సీఈవో ఎల్లయ్య, ఎంపీడీవో కృష్ణ, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

పట్టి తెచ్చి.. ముక్కబెట్టి..!

రేషన్ బియ్యం తరలిస్తుండగా తనిఖీల్లో స్వాధీనం

ప్రభుత్వ గోదాములకు తరలింపు

నెలల తరబడి నిల్వ చేయడంతో పురుగు పట్టి పాడవుతున్న వైనం

నారాయణఖేడ్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తుండగా సీజ్ చేసిన రేషన్ బియ్యం గోదాముల్లో ముక్కిపోతున్నది. వివిధ ప్రాంతాల్లో అధికారులు పట్టుకున్న 1,630 క్వింటాళ్ల బియ్యం నారాయణఖేడ్ పౌరసరఫరాల గోదాంలో ఏడాదిగా నిల్వ ఉంచారు. దీని విలువ రూ.6 లక్షల వరకు ఉంటుంది. నెలల తరబడి నిల్వ ఉంచడంతో సంచులు చిరిగిపోయాయి. బియ్యంలో పురుగు చేరింది. అదే గోదామలో చౌక ధరల దుకాణాలు, పాఠశాలలు, హాస్టళ్లకు సరఫరా చేసే బియ్యంలో నిల్వ ఉంచారు. పాడైన బియ్యం నుంచి పురుగు ఈ తాజా బియ్యంలోకి చేరుతున్నది. తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని ఎప్పటికప్పుడు వేలం వేస్తే ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. నెలల తబడి నిల్వ ఉంచడంతో పురుగు పట్టి పాడవటంతో పాటు కొత్త బియ్యంలో కూడా పురుగు చేరుతున్నది. ఈ విషయంపై పౌరసరఫరాల గోదాం ఇన్‌చార్జి సత్యం స్పందిస్తూ సీజ్ చేసిన బియ్యం నిల్వ గురించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామన్నారు.



నారాయణఖేడ్ పౌర సరఫరాల గోదాంలో ముక్కిపోతున్న రేషన్ బియ్యం



నర్సాపూర్‌లో భారీ వర్షానికి నేల కూలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలు

అర్ధరాత్రి ముంచెత్తిన వర్షం

అల్లాదుర్గంలో 119 మి.మీ.లు, నర్సాపూర్‌లో 86.3 మి.మీ.ల వర్షం

మెదక్/నర్సాపూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు అన్ని మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. అత్యధికంగా అల్లాదుర్గం మండలంలో 119.04 మి.మీ.లు, నర్సాపూర్ మండలం కాగజ్‌మద్దూర్‌లో 86.3 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. మనోహరాబాద్‌లో 70.6, శివంపేటలో 63.4, చేగుంటలో 57.3, నార్సింగిలో 53.0, మాసాయిపేటలో 53.5, రేగోడ్‌లో 55.8 మి.మీ.ల వర్షం కురిసింది. మిగతా మండలాల్లోనూ మోస్తురు నుంచి భారీ వర్షం కురిసింది. పది రోజులుగా మెదక్ జిల్లాలో వర్షాలు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్న క్రమంలో భారీ వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా 2.40 లక్షల వరినాట్లు పూర్తయినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

- వర్షానికి మెదక్ పట్టణంలోని చమన్-భారత్‌గ్యాస్, పోస్టాఫీసు రోడ్డు పైకి డ్రైనేజీ నీరు పొంగిపొర్లి రహదారి జలమయమైంది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న డ్రైనేజీ చిన్నవి కావడంతో దశాబ్దంగా చమన్-భారత్ గ్యాస్ ఏజెన్సీ రహదారి వర్షం నీటికి జలమయమవుతూనే ఉంది.
- నర్సాపూర్ పట్టణంలో వర్షం తీవ్రతకు పదో వార్డులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. వ్యవసాయశాఖ ఏడీఏ కార్యాలయం గోడలన్నీ తడిసిపోయి ఎప్పుడు కూలుతుందో అని అధికారులు, సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వినాయక చందాల కోసం ప్రాణం మీదకు..

రోడ్డుకు అడ్డంగా తాడు కట్టి బలవంతంగా వసూళ్లు

బైక్ కిందపడటంతో మహిళకు తీవ్రగాయాలు

తూప్రాన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పేరిట బలవంతపు చందా వసూళ్ల పర్వం కొనసాగుతోంది. రోడ్డుకు అడ్డుగా తాడు కట్టి వాహనాలు ఆపి వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇలా వసూలు చేసే క్రమంలో ద్విచక్ర వాహనం కిందపడటంతో మహిళకు తీవ్రగాయాలైన సంఘటన తూప్రాన్ పట్టణ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. పట్టణ పరిధి ఆబోతుపల్లిలోని పాఠశాలల వద్ద కొందరు రోడ్డుకు అడ్డంగా తాడు పట్టుకొని వచ్చే పోయే వాహనాలు నిలుపుతున్నారు. వినాయక చందాల పేరిట బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. శుక్రవారం ఉదయం మండలంలోని గుండ్రెడ్డిపల్లికి చెందిన చింతకింద లావణ్య (35), కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంపై తూప్రాన్‌కు వస్తున్నారు. రోడ్డుకు అడ్డంగా కట్టిన తాడు తగిలి బైక్ కింద పడటంతో లావణ్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమె కుమారుడు స్వల్పంగా గాయపడ్డాడు. లావణ్య పరిస్థితి విషమంగా ఉండటంతో ఆర్వీఎం ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబం డిమాండ్ చేసింది.



బైక్ పైనుంచి పడటంతో గాయపడిన లావణ్య

దళితులపై దాడి.. సమగ్ర విచారణ జరిపించాలి

● ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



గ్రామంలో విచారణ చేస్తున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

చేగుంట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): చేగుంట మండలం బి.కొండాపూర్ గ్రామంలో దళితులపై దాడి విషయంలో సమగ్ర విచారణ చేయాలని అధికారులను ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. కమిషన్‌కు ఫిర్యాదు అందగా ఆయన శుక్రవారం గ్రామాన్ని సందర్శించి విచారణ చేపట్టారు. తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, డీఎస్పీ నరేందర్‌గౌడ్ కూడా ఆయనతో ఉన్నారు. ఒక మైనర్ కిడ్నాప్ కేసు విషయంలో బైంసా పోలీసులు గ్రామానికి వచ్చారని, ఆ సమయంలో పోలీసులు తమపై దాడి చేశారని దళితులు కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. అయితే, బైంసా పోలీసులు గ్రామీణులపై దాడి చేశారన్న ఆరోపణలను కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఖండించారు. చేగుంట పోలీసుల అతి ఉత్సాహం వల్ల దళితులపై దాడి జరిగిందని, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరపాలని అధికారులను ఆదేశించారు. దళితులపై పోలీసుల దాడి బాధాకరమని, దీనిపై జిల్లా ఎస్పీ, కలెక్టర్‌తో చర్చించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ విచారణలో రామాయంపేట సీఐ వెంకటరాజ గౌడ్, చేగుంట తహసీల్దార్ శ్రీకాంత్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎంపీ సురేష్‌షెట్కార్‌కు సీఎం రేవంత్‌రెడ్డి పుట్టినరోజు శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతూ ముఖ్యమంత్రి రాసిన లేఖ

నారాయణఖేడ్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ శుక్రవారం తన పుట్టినరోజును ఢిల్లీలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయనకు లేఖ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవలో నిమగ్నమై, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామి కావడానికి భగవంతుడు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి లేఖ రాయడం జహీరాబాద్ పార్లమెంట్ ప్రజలందరికీ గౌరవదాయకంగా భావిస్తున్నట్లు సురేష్‌షెట్కార్ తెలిపారు. తనకు శుభాకాంక్షలు తెలిపినందుకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

సిగాచి పరిశ్రమ యాజమాన్యంపై చర్యలేవి?

సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సిగాచి పరిశ్రమలో కార్మికుల మృతికి కారణమైన యాజమాన్యంపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ ప్రశ్నించారు. సిగాచి కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సంగారెడ్డిలో ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేశారు. 54 మంది కార్మికుల మృతికి కారణమైన యాజమాన్యాన్ని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు రూ.కోటి, క్షతగాత్రులకు రూ.50 లక్షల నష్టపరిహారం ఒకేసారి తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.

క్రైం కార్నర్

సిలిండర్ లీకై మహిళ మృతి

ఝరాసంగం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా ఏడాకులపల్లి గ్రామంలో ఈనెల 6న వంటగ్యాస్ సిలిండర్ లీకై మంటలు చెలరేగిన ఘటనలో గాయాలైన గొర్రెకంటి శంకరమ్మ(65) హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందింది. స్థానిక ఎస్‌ఐ క్రాంతి కుమార్‌పాటిల్ కథనం ప్రకారం.. మృతురాలు శంకరమ్మతోపాటు కుమారులు ప్రభు, విఠల్ గాయాలకుగురై హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నారు. శంకరమ్మ పరిస్థితి విషమంగా ఉండడంతో మృతిచెందింది. శంకరమ్మ భర్త బక్కన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య



పవన్‌కల్యాణ్ (ఫైల్)

తూప్రాన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధను తట్టుకోలేక యువకుడు పురుగుల మందు తాగి చనిపోయాడు. తూప్రాన్ ఎస్‌ఐ శివానందం కథనం ప్రకారం.. తూప్రాన్ మండలం దాతర్‌పల్లి గ్రామానికి చింతల పవన్‌కల్యాణ్(29) వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవాడు. వ్యవసాయం, ఇతర కుటుంబ అవసరాలకు అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో గత నెల 13న పురుగుల మందు తాగాడు. వెంటనే అతడిని లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న పవన్‌కల్యాణ్ శుక్రవారం మృతిచెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివానందం తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : గంజాయి అమ్మడానికి ప్రయత్నిస్తున్న ఇద్దరిని టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి అదుపులోకి తీసుకున్నట్లు త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ శుక్రవారం తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. నిందితుల నుంచి 140 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, రూ.1000 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నాంచారుపల్లి గ్రామ శివారులోని బక్రిచెప్యాల రోడ్డుపక్కన పైపుల ఫ్యాక్టరీ దగ్గర ఖాళీ ప్రదేశంలో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారంతో దాడులు చేసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ చంద్రయ్య, టాస్క్‌ఫోర్స్ పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

మనస్తాపంతో వృద్ధురాలి ఆత్మహత్య



మన్నె లక్ష్మి మృతదేహం

చేగుంట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ మనస్తాపం చెందిన వృద్ధురాలు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నార్సింగ్ మండలం వల్లూరు శివారులో జరిగింది. నార్సింగ్ ఎస్‌ఐ సృజన తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ మండలం చంద్రగిరి గాజులరామారంకి చెందిన మన్నె లక్ష్మి(65) ఈనెల 7న సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుమారుడు మన్నె ఉమేష్ చుట్టుపక్కల బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. నార్సింగి మండలం వల్లూరు బస్టాండ్ వద్ద స్థానికులు సమాచారం ఇవ్వడంతో వచ్చి చూసే సరికి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కొన్ని రోజులుగా అనారోగ్యంతో పాటు వృద్ధాప్యంతో బాధపడుతూ మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుందని కుటుంబసభ్యులు తెలిపారు. కుమారుడు మన్నె ఉమేష్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

సిద్దిపేట.. రాఖీల తోట

పట్టణ కేంద్రంగా తయారీ

చైనా, రాజ్‌కోట్ నుంచి ముడిసరుకులు

ఇతర రాష్ట్రాలకు సైతం ఇక్కడి నుంచే సప్లై

రూపాయి నుంచి రూ.10వేల రాఖీలు కూడా అందుబాటులో..





రాఖీలను తయారు చేస్తున్న సిబ్బంది, విజయలక్ష్మి రాఖీ తయారీ సెంటర్‌లో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : అన్నింటా ముందుండే సిద్దిపేట జిల్లా కేంద్రం రాఖీల తయారీలోనూ కీలక కేంద్రంగా మారింది. చైనా, రాజ్‌కోట్ నుంచి నాణ్యమైన ముడిసరుకులు దిగుమతి చేసుకుని ఇక్కడే వినూత్నమైన రాఖీలు తయారు చేస్తున్నారు. రూపాయి నుంచి మొదలుపెట్టి రూ.పది వేల వరకు ధర పలికే ఖరీదైన రాఖీల వరకు అందుబాటులో ఉన్నాయి.

పదేళ్లుగా సిద్దిపేట కేంద్రంగా రాఖీల తయారీ



పదేళ్లుగా సిద్దిపేట కేంద్రంగా రాఖీలు తయారు చేసి తక్కువ ధరలకే నాణ్యమైన రాఖీలను అందిస్తున్నాం. లాభాపేక్ష కంటే వినియోగదారులకు మంచి సేవ చేయాలనేదే మా లక్ష్యం. మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా, పిల్లలను ఆకట్టుకునేలా, పర్యావరణానికి ప్రాముఖ్యతనిస్తూ వినూత్నమైన రాఖీలను తయారు చేసి ఇస్తున్నాం.

-చీకోటి మధుసూదన్, శ్రీవిజయలక్ష్మి మెగా రాఖీ సెంటర్, సిద్దిపేట

రాఖీల తయారీతో ఉపాధి

సిద్దిపేటలో సుమారు 15 వరకు రాఖీ మ్యానుఫ్యాక్చరింగ్, హోల్‌సేల్ సెంటర్లు ఉన్నాయి. వీటి వల్ల స్థానికులకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. నాణ్యతతో కూడిన రాఖీలు తక్కువ ధరలకే లభిస్తుండడంతో రిటైల్ వ్యాపారులకు, వినియోగదారులకు లాభం చేకూరుతోంది.

రాష్ట్రాలు దాటిన సిద్దిపేట రాఖీలు

సిద్దిపేటలో తయారయ్యే రాఖీలకు మంచి పేరుంది. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా, గోవా వంటి రాష్ట్రాలకూ ఇక్కడి నుంచి రాఖీలు ఎగుమతి అవుతున్నాయి. అంతేకాకుండా, విదేశాల్లో ఉంటున్న తమ సోదరులకు కొరియర్ ద్వారా పంపడానికి కూడా చాలా మంది ఇక్కడి రాఖీలను కొనుగోలు చేస్తున్నారు.

ఆకట్టుకుంటున్న వెరైటీ రాఖీలు

సిద్దిపేటలో పట్టణంలో రకరకాల రాఖీలు ఆకట్టుకుంటున్నాయి. స్వస్తిక్ గుర్తు, పూసలు, రంగు రాళ్లు, ఆధ్యాత్మిక చిహ్నాలు, విభిన్న బొమ్మలతో రూపొందించిన రాఖీలు చూపరులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. పిల్లలను ఆకర్షించేలా డిఫరెంట్ రాఖీలు కూడా అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా రాఖీల షాపింగ్ కోసం యువతులు, మహిళలు దుకాణాలకు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. మరోవైపు, సోదరి కోసం బహుమతులుగా చీరలు, ఇతర వస్తువులను కొనుగోలు చేసేందుకు సోదరులు కూడా షాపింగ్‌లో నిమగ్నమయ్యారు. దీనితో సిద్దిపేట పట్టణంలోని రోడ్లన్నీ జనసందోహంగా మారాయి.












హుస్నాబాద్, మెదక్, గుమ్మడిదల పట్టణాల్లో రాఖీలను కొనుగోలు చేస్తున్న మహిళలు

రాఖీ పండుగ సందడి!



నారాయణఖేడ్ పట్టణంలో ఏర్పాటు చేసిన రాఖీల దుకాణం



మెదక్/ గుమ్మడిదల/ నారాయణఖేడ్/ హుస్నాబాద్/ వెల్దుర్తి/ ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగ శనివారం జరుపుకోనుండడంతో దుకాణాల్లో, మార్కెట్లలో సందడి నెలకొంది. మెదక్, గుమ్మడిదల, నారాయణఖేడ్, హుస్నాబాద్, వెల్దుర్తి పట్టణాల్లోని ప్రధాన కూడళ్లు, రహదారుల పక్కన రాఖీ దుకాణాలు వెలిశాయి. వివిధ రకాల డిజైన్లతో ఆకట్టుకుంటున్న రాఖీలను కొనుగోలు చేసేందుకు మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో దుకాణాలకు తరలివస్తున్నారు. రాఖీలు కట్టిన తర్వాత సోదరులకు తీపి తినిపించడం ఆనవాయితీ కావడంతో స్వీట్ షాపుల్లో కూడా సందడి నెలకొంది. వ్యాపారులు వివిధ రకాల మిఠాయిలను సిద్ధం చేసి విక్రయిస్తున్నారు. రాఖీల విషయానికొస్తే, ఈసారి రూ.2 నుంచి రూ.300 వరకు ధరలు పలుకుతున్నాయి. సంప్రదాయ నూలు పోగు రాఖీలకంటే ఫ్యాన్సీ రాఖీలకే ఎక్కువ డిమాండ్ ఉంది. రాళ్లతో పొదిగిన బ్రాస్‌లెట్ రాఖీలు, వెండి, బంగారు రాఖీలు కూడా మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. నారాయణఖేడ్‌లో అయితే కుంకుమ భరిణిలతో చేసిన ప్రత్యేక ప్లేట్లు కూడా అమ్ముడవుతున్నాయి. గుమ్మడిదల, బొంతపల్లి, అన్నారం వంటి ప్రాంతాల్లో చిన్న చిన్న షెడ్లు వేసుకుని చిల్లర వర్తకులు రాఖీలు అమ్ముతున్నారు. ముఖ్యంగా మెదక్-హైదరాబాద్ జాతీయ రహదారిపై రాఖీ దుకాణాలు పెద్ద ఎత్తున ఉండడంతో యువతుల రాకపోకలతో సందడి నెలకొంది. హుస్నాబాద్‌లో శుక్రవారం సంత కావడంతో రాఖీ కొనుగోళ్లు మరింత పెరిగి పట్టణంలో జనసందోహం కనిపించింది. వెల్దుర్తిలో కూడా రంగురంగుల రాఖీలు, రకరకాల మిఠాయిలు కొనుగోలు చేయడానికి మహిళలు, చిన్నారులు ఎక్కువగా వచ్చారు.



మెదక్ కలెక్టరేట్ ప్రాంగణంలో ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న ప్రభుత్వోద్యోగులు

దుబ్బాక ఎమ్మెల్యే వ్యాఖ్యలపై దుమారం

● మెదక్ కలెక్టరేట్‌లో ఉద్యోగ సంఘాల నిరసన

● కలెక్టర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

● టీఎన్‌జీవోల సంఘం మెదక్ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్

మెదక్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మెదక్ కలెక్టర్‌పై చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. గురువారం జరిగిన రైతు మహాధర్నాలో ఆయన చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ శుక్రవారం మెదక్ కలెక్టరేట్ వద్ద ఉద్యోగ సంఘాలు నిరసన కార్యక్రమం చేపట్టాయి. భోజన విరామ సమయంలో ఉద్యోగులు, టీచర్లు నినాదాలతో కలెక్టరేట్‌ను హోరెత్తించారు. ఈ సందర్భంగా టీఎన్‌జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ మాట్లాడుతూ కలెక్టర్ రాహుల్ రాజ్ సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా పారదర్శకంగా, జవాబుదారీతనంతో పనిచేస్తున్నారని తెలిపారు. కలెక్టర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని ఖండించారు. భవిష్యత్తులో ఏ ప్రభుత్వ అధికారిపైనా ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని, అన్ని ఉద్యోగ సంఘాలు వారికి అండగా ఉంటాయని నరేందర్ స్పష్టం చేశారు. ఈ నిరసనలో టీఎన్‌జీవో, గెజిటెడ్, ఫోర్త్ క్లాస్ ఎంప్లాయీస్ యూనియన్, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మంత్రుల చరిత్ర తెలుసుకొని మాట్లాడాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాక, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మంత్రుల చరిత్ర తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. శుక్రవారం ఆయన దుబ్బాకలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తెలంగాణ కోసం సోనియా గాంధీని ఒప్పించిన దామోదర్ రాజనర్సింహ, నిరుపేదల కోసం కృషి చేస్తున్న వివేక్ వెంకటస్వామి కుటుంబాల చరిత్రను తెలుసుకోవాలన్నారు. కాళేశ్వరం డబ్బులతో ఓట్లు కొనుగోలు చేసి గెలిచిన ప్రభాకర్‌రెడ్డి చరిత్ర ప్రజలకు తెలియనిది కాదని ఆయన ఆరోపించారు. ప్రభాకర్‌రెడ్డి తన మాట తీరు మార్చుకోకపోతే, గ్రామాల్లోకి అడుగు పెట్టనివ్వబోమని హెచ్చరించారు. దామోదర్ రాజనర్సింహ కుటుంబం ప్రజాజీవితంతో ముడిపడి ఉన్నదని, వివేక్ వెంకటస్వామి కుటుంబం వేలాది మంది పేదలకు ఇళ్లు కట్టించిన ఘనత వారిదని కొనియాడారు. వారిపై విమర్శలు చేస్తే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని, తగిన బుద్ధి చెబుతుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

మండలాలను చార్మినార్ జోన్‌లో కలపాలి

బీజేపీ ఆమరణ నిరాహార దీక్ష



ఆమరణ నిరహార దీక్షలో బీజేపీ నాయకులు

అల్లాదుర్గం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాజన్న జోన్‌లో ఉన్న అల్లాదుర్గం, రేగోడ్, టేక్మాల్ మండలాలను చార్మినార్ జోన్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. అల్లాదుర్గం ఐబీ చౌరస్తాలో బీజేపీ మండల అధ్యక్షుడు జిన్న భాస్కర్‌రెడ్డి నేతృత్వంలో ఈ దీక్ష ప్రారంభమైంది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు. ఈ మండలాలను చార్మినార్ జోన్‌లో కలిపి, అల్లాదుర్గంలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసే వరకు దీక్షను కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.

మూతబడిన పాఠశాలలు తెరిపించేలా చర్యలు

● అడిషనల్ డైరెక్టర్ రమణకుమార్

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూతబడిన పాఠశాలలు తిరిగి తెరిపించేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ రమణకుమార్ ఆదేశించారు. సంగారెడ్డిలోని సమగ్ర శిక్ష కార్యాలయంలో శుక్రవారం ఎంఈవోలతో సమావేశం నిర్వహించి విద్యాశాఖ కార్యక్రమాలపై సమీక్షించారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న పాఠశాలల్లో సౌకర్యాల కల్పనపై దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థుల నమోదు, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం వంటి అంశాలపై ఆయన సమీక్షించారు.

నైపుణ్యాభివృద్ధి, శిక్షణతోనే ఉపాధి

● గీతం యూనివర్సిటీలో అప్రెంటిస్‌షిప్ అవగాహన సదస్సు

పటాన్‌చెరు రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యాభివృద్ధి, ఆచరణాత్మక శిక్షణతోనే యువతకు మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వ అధికారులు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ యూనివర్సిటీలో శుక్రవారం నిర్వహించిన ఒకరోజు అప్రెంటిస్‌షిప్ అవగాహన వర్క్‌షాప్‌లో ఈ విషయంపై చర్చ జరిగింది. గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్, ఫుడ్ ఇండస్ట్రీ కెపాసిటీ అండ్ స్కిల్ ఇనిషియేటివ్(ఎఫ్ఐసీఎస్ఐ) సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ వర్క్‌షాప్‌నకు హాజరైన తెలంగాణ ప్రాంతీయ డైరెక్టరేట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (ఆర్‌డీఎస్‌డీఈ) అధికారి వివి. సతీష్‌రెడ్డి మాట్లాడుతూ నేషనల్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ స్కీమ్ (ఎన్ఏటీఎస్) ద్వారా యువతకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయని తెలిపారు. ఈ శిక్షణ విద్యా పరిజ్ఞానానికి, పరిశ్రమ అవసరాలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గిస్తుందని ఆయన వివరించారు. జాతీయ నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ (ఎన్ఎస్‌డీసీ) సమన్వయకర్త పూనమ్ వర్మ, ఎఫ్ఐసీఎస్ఐ సీనియర్ మేనేజర్ పుష్పితా రాణా కెరీర్ మార్గాలు, నైపుణ్యాభివృద్ధి అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ సైన్స్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కాజీపల్లి

అక్రమ నిర్మాణాల కూల్చివేత

● రెవెన్యూ అధికారుల చర్యలు



కూల్చి వేయిస్తున్న రెవెన్యూ అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జిన్నారం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిన్నారం మండలం కాజీపల్లి పరిధిలోని ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మించిన కట్టడాలను 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. కాజీపల్లి 181 సర్వే నంబర్‌లో రూ.కోటి విలువైన ప్రభుత్వ స్థలంలో మూడు రోజులుగా నిర్మిస్తున్న బేస్‌మెంట్లను ఆర్ఐ జయప్రకాష్ నారాయణ ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్‌లతో కూల్చివేశారు. ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

యూరియా ఎక్కువగా వాడొద్దు



మల్కాపూర్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ రాంప్రసాద్

టేక్మాల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వరి పంటకు యూరియా ఎక్కువగా వాడటం వల్ల చీడపీడలు అధికంగా వస్తాయని పెద్దశంకరంపేట ఏడీఏ రాంప్రసాద్ రైతులకు సూచించారు. శుక్రవారం మల్కాపూర్ గ్రామంలో పత్తి, వరి పంటలను పరిశీలించి, రైతులకు సూచనలు చేశారు. సమగ్ర వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. రసాయన ఎరువులను వీలైనంత తక్కువగా వాడాలని, అధిక యూరియా వల్ల పంటకు లాభం కంటే నష్టమే ఎక్కువని చెప్పారు. పత్తి పంటలో తెల్లదోమ, పచ్చదోమ వంటి పురుగుల ఉధృతిని తగ్గించడానికి సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి ఇంద్రయ్య, రైతులు పాల్గొన్నారు.

● వెల్దుర్తి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వెల్దుర్తిలో ఏఈవో మాజీద్ రైతులకు యూరియా వాడకంపై అవగాహన కల్పించారు. ఎకరాకు 60 కిలోల యూరియాను విడతలవారీగా వాడాలని సూచించారు. అధిక యూరియా వాడకం వల్ల మొక్కల్లో శాకీయోత్పత్తి పెరిగి, చీడపీడలు ఎక్కువగా వస్తాయని, భూగర్భ జలాలు కూడా కాలుష్యం అవుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు సిద్దిరాములు పాల్గొన్నారు.

చెట్లు నరికితే చర్యలు

● సంగారెడ్డి జిల్లా అటవీశాఖ అధికారి శ్రీధర్‌రావు



నరికివేసిన చెట్లను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో శ్రీధర్‌రావు

జహీరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అటవీ శాఖ అనుమతులు లేకుండా చెట్లు నరికితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా అటవీ శాఖ అధికారి శ్రీధర్ రావు హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని హౌజింగ్ బోర్డు పార్కులో నరికివేతకు గురైన చెట్లను ఆయన పరిశీలించారు. చెట్లు నరికిన వారిపై కేసులు నమోదు చేసి, వాహనాలను సీజ్ చేశామని తెలిపారు. అడవులు, చెట్లను కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో దేవిలాల్, సెక్షన్ అధికారి కిరణ్‌కుమార్, జహీరాబాద్ బీట్ అధికారి గంగా భవాని తదితరులు పాల్గొన్నారు.

రద్దు చేసిన ఓట్లను పునరుద్ధరించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకుల

జహీరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): బీహార్‌లో ఎన్నికల సంఘం 64 లక్షల ఓట్లను రద్దు చేసిందని, ఇది బీజేపీకి వత్తాసు పలకడమేనని సీపీఎం జిల్లా నాయకులు రాంచందర్, మైపాల్ ఆరోపించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం జహీరాబాద్ పట్టణంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా వ్యవహరించకుండా బీజేపీ తొత్తుగా మారిందని విమర్శించారు. దళితుల ఓట్లను రద్దు చేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. రద్దు చేసిన ఓట్లను పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు.

మట్టి తరలింపును అడ్డుకున్న రైతులు

జిన్నారం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిన్నారం సర్వే నెంబర్ 1లోని టీఎస్ ఐఐసీకి కేటాయించిన భూమి నుంచి అక్రమంగా మట్టి తరలిస్తుండగా రైతులు అడ్డుకున్నారు. రైతుల నుంచి సేకరించిన భూములకు పరిహారంగా అందజేసిన 600 గజాల స్థలాలకు పొజిషన్లు చూపకుండా మట్టి తవ్వకాలకు ఎలా అనుమతి ఇచ్చారని వారు ప్రశ్నించారు. రైతులు ఆర్ఐ జయప్రకాష్ నారాయణను కలిసి ఫిర్యాదు చేశారు.

12 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

హవేళిఘణపూర్, ఆగస్టు8;(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కూచన్‌పల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న 12 మందిని టాస్క్ ఫోర్స్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.17,209, 11 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.



సత్యగామలో పెచ్చులూడుతున్న ప్రాథమిక పాఠశాల పైకప్పు

ఖేడ్ మండలం అబ్బెంద ప్రాథమిక పాఠశాల భవనం దుస్థితి

శిథిలావస్థకు చేరుకున్న సత్యగామ పాఠశాల భవనం

శిథిలావస్థలో బడులు

నారాయణఖేడ్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల అభివృద్ధికి నిధులు మంజూరవుతున్నప్పటికీ, కొన్ని పాఠశాలలు ఇంకా శిథిలావస్థలోనే ఉన్నాయి. నారాయణఖేడ్ మండలం, సత్యగామ ప్రాథమిక పాఠశాలలో 30 మంది విద్యార్థులు ఉన్నారు. రెండు తరగతి గదుల పైకప్పు పెచ్చులు ఊడి పడుతుండటంతో విద్యార్థులు భయపడుతున్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను బడికి పంపడానికి భయపడుతున్నారు. మండల పరిధిలోని అబ్బెంద ప్రాథమిక పాఠశాలలో వందమంది విద్యార్థులు ఉన్నారు. మన ఊరు, మన బడి పథకం ద్వారా పాఠశాల అభివృద్ధికి నిధులు మంజూరైనా, ఐదు గదుల్లో మాత్రమే పనులు చేసి, ఒక గదిని శిథిలావస్థలోనే వదిలేశారు. సత్యగామ, అబ్బెంద గ్రామాల్లోని పాఠశాల గదులు ప్రమాదకరంగా ఉన్నాయని ఆయా గ్రామాల వారు అన్నారు. మండలంలోని 73 ప్రాథమిక, 10 ఉన్నత, 3 ప్రాథమికోన్నత పాఠశాలు న్నాయి. 8 పాఠశాలల్లో టాయిలెట్స్ వసతి కూడా లేదని తెలిపారు. అధికారులు స్పందించి ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా ఎంపీ సురేష్ షెట్కార్ పుట్టినరోజు వేడుకలు



కేక్‌కట్ చేస్తున్న కార్యకర్తలు, అభిమానులు

నారాయణఖేడ్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ జన్మదిన వేడుకలను శుక్రవారం కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు, నాయకులు ఘనంగా నిర్వహించారు. ఎంపీ ఢిల్లీలో పార్లమెంటు సమావేశాల్లో ఉండటంతో ఆయన ఇంటి ఆవరణ, రాజీవ్ చౌక్ వద్ద కేకులు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. బాణసంచా కాల్చి ఎంపీకి అనుకూలంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మొబైల్ ఫోన్‌ల ద్వారా ఎంపీకి శుభాకాంక్షలు చెప్పారు. గ్రామాల్లోనూ కార్యకర్తలు జన్మదిన వేడుకలు నిర్వహించారు.

● కంగ్టి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కంగ్టిలో కూడా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎంపీ సురేష్ షెట్కార్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సర్దార్, మనోజ్ పాటిల్, నర్సింలు, చందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● నాగల్‌గిద్ద, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నాగల్‌గిద్ద మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఎంపీ సురేష్ షెట్కార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ సంజీవ్‌పటేల్, కాంగ్రెస్ నాయకులు రాంశెట్టిపటేల్, బాపుశెట్టి, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

● జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారి

నిజాంపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఇంటి పరిసరాల్లో నిలిచి ఉన్న నీటిని తొలగించాలని జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్ సూచించారు. మండల కేంద్రంతో పాటు కల్వకుంట గ్రామాలను సందర్శించి అంగన్‌వాడీ, పీఏసీఎస్ కార్యాలయాలను పరిశీలించారు. యూరియా కొరత గురించి అడిగి తెలుసుకున్నారు. మండలంలో యూరియా కొరత లేదని, 750 మెట్రిక్ టన్నుల యూరియా పంపించామని తెలిపారు. నానో యూరియా, డీఏపీ వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి ఏడీఏ రాజ్ నారాయణ, ఏవో సోమలింగారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు, అంగన్‌వాడీ టీచర్లు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం



సఫాయి కార్మికులతో రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి

శివ్వంపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): క్విట్ ఇండియా ఉద్యమ దినోత్సవం సందర్భంగా రైతు వేదికలో కృషి విజ్ఞాన గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సఫాయి సలాం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మండలంలోని 110 మంది పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నవీన్ గుప్తా, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత ప్రయాణమే ఆర్టీసీ లక్ష్యం

నారాయణఖేడ్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే ఆర్టీసీ లక్ష్యమని డీఎం మల్లేశయ్య అన్నారు. శుక్రవారం ఖేడ్‌లోని రాజీవ్ చౌక్ బస్‌స్టాప్ వద్ద పర్యవేక్షణ కమిటీ పనితీరును పరిశీలించారు. ఖేడ్ నుంచి లింగంపల్లి, పటాన్‌చెరు, సికింద్రాబాద్‌కి రద్దీకి అనుగుణంగా బస్సులు నడుపుతున్నామని తెలిపారు. అసిస్టెంట్ డీఎం నర్సింహులు, పీఆర్వో పాండు పాల్గొన్నారు.



మొక్క నాటిన అదనపు కలెక్టర్ నగేష్

మొక్కలతోనే ప్రాణవాయువు

● మెదక్ అదనపు కలెక్టర్ నగేష్

మనోహరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మొక్కల పెంపకంతోనే మానవాళికి ప్రాణయువు లభిస్తుందని మెదక్ అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. వనమహోత్సవంలో భాగంగా మనోహరాబాద్ మండలంలోని కాళ్లకల్ పారిశ్రామిక వాడలో లోకేష్ మిషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, జీఎమ్ పరిశ్రమలో పరిశ్రమ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల జిల్లా జనరల్ మేనేజర్ ప్రకాష్‌రావు, లోకేష్ మిషన్స్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఫారెస్టు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ చంద్రశేఖర్, తహసీల్దార్ ఆంజనేయులు, రెవెన్యూ సిబ్బంది, పరిశ్రమ యాజమన్యం పాల్గొన్నారు.

లాభాల బాటలో వెల్దుర్తి సొసైటీ



మాట్లాడుతున్న వెల్దుర్తి సొసైటీ చైర్మన్ అనంతరెడ్డి

వెల్దుర్తి, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి) : వెల్దుర్తి సొసైటీ లాభాల బాటలో కొనసాగుతుందని ఆ సొసైటీ చైర్మన్ అనంతరెడ్డి తెలిపారు. వెల్దుర్తి ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో అర్ధవార్షిక మహాజన సభను శుక్రవారం ఆయన అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జమ, ఖర్చుల పట్టిక నివేదిక వంటి వివరాలను సభ్యులకు సొసైటీ సీఈవో అశోక్ చదివి వినిపించారు. అలాగే 2024-25 సంవత్సరానికి సంబంధించిన ఆడిట్ రిపోర్ట్ ఆమోదించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రూ.4కోట్ల లాభాల్లో కొనసాగుతుందన్నారు. శెట్టిపల్లిలో 5ఎకరాలలోని గోదాంకు సంబంధించి సంపూర్ణ హక్కులు కల్పించారన్నారు. త్వరలో వెల్దుర్తికి కోల్డ్ స్టోరేజ్ మంజూరు కానున్నదని, శెట్టిపల్లిలో రైస్ మిల్లు నిర్మాణానికి కృషి చేస్తునామన్నారు. డీసీసీబీ ద్వారా రూ.14.27 కోట్ల స్వల్పకాళిక రుణాలు, రూ. 2.18 కోట్ల దీర్ఘకాళిక రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

రోడ్డును పటిష్టం చేయాలి

కంగ్టి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కంగ్టి నుంచి బీంరాకు వెళ్లే రోడ్డుపై నిర్మిస్తున్న వంతెన వద్ద తాత్కాలిక రోడ్డును పటిష్టం చేయాలని సీపీఎం నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం ఉన్న తాత్కాలిక రోడ్డు మట్టితో నిర్మించడంతో వర్షానికి బురదమయంగా మారి రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని వారు తెలిపారు. వాహనాలు బురదలో ఇరుక్కుపోతున్నాయని, అధికారులు స్పందించి పటిష్టమైన రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి నరేష్, సతీష్, సోపాన, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యం అందించడంలో ప్రభుత్వం విఫలం

● సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మల్లేశం

వెల్దుర్తి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మల్లేశం మండిపడ్డారు. శుక్రవారం వెల్దుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, ప్రజలకు అందుతున్న సేవలు, మౌలిక వసతులు పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. 2014లో కాంగ్రెస్ ప్రభుత్వం శంకుస్థాపన చేసిన 100 పడకల ఆసుపత్రి నిర్మాణం ఇప్పటికీ ప్రారంభం కాలేదని విమర్శించారు. తగినంత మంది డాక్టర్లు, సిబ్బందిని నియమించి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గౌరీ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పౌర సరఫరాల గోదాం ఇన్‌చార్జిగా శ్రీనివాస్

నారాయణఖేడ్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ పౌర సరఫరాల గోదాం ఇన్‌చార్జిగా డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న హరిబాబు బదిలీ కావడంతో, జోగిపేట గోదాం ఇన్‌చార్జి సత్యం ఇన్‌చార్జిగా వ్యవహరించారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీ

నారాయణఖేడ్ పౌర సరఫరాల గోదాంను శుక్రవారం విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోదాంలో నిల్వ ఉన్న బియ్యం వివరాలను, పాఠశాలలు, హాస్టళ్లు, చౌక ధరల దుకాణాలకు సరఫరా చేసిన రికార్డులను పరిశీలించారు. రికార్డుల్లో ఎలాంటి పొరపాట్లు లేకపోవడంతో వారు సంతృప్తి వ్యక్తం చేశారు.

చెరువు మట్టి తరలింపుపై ఫిర్యాదు

నారాయణఖేడ్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట పరిధిలోని ఖాన చెరువు మట్టిని 161 బీ జాతీయ రహదారి కాంట్రాక్టర్ అక్రమంగా తరలిస్తున్నాడని నిజాంపేట గ్రామస్థులు ఆరోపించారు. ఈ మేరకు నిజాంపేటకు చెందిన మాజీ సర్పంచు జగన్‌చారి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాధాకిషన్, మాజీ ఉప సర్పంచు రాంచందర్, శ్రీనివాస్‌రావు తదితరులు శుక్రవారం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. అక్రమంగా మట్టి తరలించడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, చెరువు బలహీనపడుతుందని వారు తెలిపారు. అక్రమ మట్టి తవ్వకాలను నివారించాలని, లేకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

నర్సాపూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ పట్టణానికి చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సహాయ చెక్కులను ఎమ్మెల్యే సునీతారెడ్డి అందజేశారు. శుక్రవారం ఆమె తన స్వగృహంలో అస్గర్ అలీకి రూ.60 వేలు, భాస్కర్ నాయక్‌కు రూ.6 వేల విలువగల చెక్కులను అందజేశారు. సీఎంఆర్ఎఫ్ సహాయం పేద కుటుంబాలకు వైద్య ఖర్చుల విషయంలో ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నయామొద్దీన్, మాజీ ఎంపీటీసీ సత్యం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● మనోహరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామానికి చెందిన పటేల్ నిర్మలకు చికిత్స నిమిత్తం మంజూరైన రూ.21 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును రాష్ట్ర సర్పంచుల ఫోరం మాజీ ఉపాధ్యక్షుడు నత్తి మల్లేష్ ముదిరాజ్ అందజేశారు. ఈ చెక్కు మెదక్ ఎంపీ రఘునందర్ రావు చొరవతో మంజూరైంది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ లావణ్య, బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు నరేందర్‌చారి, కుమ్మరి నాగరాజు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఎక్సైజ్ సిబ్బంది

మనోహరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కూచారం గ్రామంలో వనమహోత్సవం సందర్భంగా ఎక్సైజ్ అధికారులు మొక్కలు నాటారు. గ్రామంలోని చెరువు కట్టపై ఎంపీడీవో రవీందర్, నర్సాపూర్ ఎక్సైజ్ ఎస్ఐ అజీజ్ అహ్మద్‌తో కలిసి ఏపీవో ఆదినారాయణ ఈత మొక్కలను నాటారు. చెట్లను కాపాడే బాధ్యత అందరిపై ఉందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ లక్ష్మీనరసింహగౌడ్, ఎక్సైజ్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

చిన్నగొట్టిముక్క పాఠశాలలో రక్షాబంధన్



శివ్వంపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నగొట్టిముక్ల ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థినులు, విద్యార్థులు రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు విద్యార్థులకు రాఖీలు కట్టి సోదర భావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సురేష్, ఉపాధ్యాయులు స్వాతి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సెల్‌ఫోన్‌లు అందజేత

ఝరాసంగం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఝరాసంగం పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఎస్ఐ పాటిల్ క్రాంతి కుమార్ సెల్‌ఫోన్‌లను పోగొట్టుకున్న ఏడుగురు బాధితులకు వాటిని తిరిగి అప్పగించారు. సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) ద్వారా రికవరీ చేయడం జరిగిందని ఎస్ఐ తెలిపారు. సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.



పలుచోట్ల ఫ్రైడే-డ్రైడే

నారాయణఖేడ్/చిలప్‌చెడ్/నర్సాపూర్/తూప్రాన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల నియంత్రణలో భాగంగా పలు మున్సిపాలిటీల్లో ఫ్రైడే-డ్రైడే నిర్వహించారు. నారాయణఖేడ్, చిలప్‌చెడ్, నర్సాపూర్, తూప్రాన్‌లలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, సిబ్బంది స్వయంగా వీధుల్లో తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. నారాయణఖేడ్‌లో శానిటేషన్ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో 9వ వార్డులో పాత టైర్లు, కూలర్లలో నీటిని తొలగింపజేసి దోమల లార్వా ఉత్పత్తి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చిలప్‌చెడ్ మండలం చిట్కుల్‌లో ఎంపీడీవో ప్రశాంత పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించి, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. నర్సాపూర్‌లోని 9వ వార్డు చైతన్యపురి కాలనీలో మున్సిపల్ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలో అవగాహన కల్పించారు.



సింగూరు డేంజర్ బెల్స్..!

(5వ పేజీ తరువాయి)

అడ్డు తగులుతున్నట్లుగా నివేదికలో పొందుపర్చారు. సింగూరు ప్రాజెక్టు భద్రతపైనా గత జూన్ నెలలో ఈ బృందం సభ్యులు పరిశీలన జరిపారు. అడుగడుగునా క్షుణ్ణంగా పరిశీలించి ప్రాజెక్టులో ఉన్న లోటుపాట్లను గుర్తించారు. గేట్లు లీకేజీలు ఉన్నాయని, రిజర్వాయర్‌కు గండిపడే అవకాశాలు లేకపోలేదని ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో పేర్కొన్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టకపోతే ఎప్పుడేం జరుగుతుందో చెప్పలేమన్నట్లుగా సందేహాలు వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

బాధ్యులెవరు?

సింగూరు రిజర్వాయర్‌పై కనీసం పర్యవేక్షణ చూపకపోవడానికి కారణమెవరనే విషయంపై తగిన విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది. మూడేళ్లుగా ప్రాజెక్టు భద్రత విషయంలో అనేక లోటుపాట్లు కనిపిస్తూనే ఉన్నాయి. తాత్కాలిక మరమ్మతులతో తూతూమంత్రంగా పనులు చేపట్టి వదిలేస్తున్నారు. కొత్త ప్రాజెక్టులకు వేలాది కోట్లు కుమ్మరిస్తున్న క్రమంలో పాత ప్రాజెక్టుల మరమ్మతులకు కూడా నిధులను విడుదల చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. అడపాదడపా వచ్చిన నిధులు కూడా దుర్వినియోగమైన సందర్భాలున్నాయి. ఈ అంశాలపై ఎలాంటి విచారణ చేయడం లేదు. ఇందుకు సంబంధించిన బాధ్యులపై చర్యలు తీసుకోవడంలోనూ నిర్లక్ష్యమే కనిపిస్తోంది. తాజా నివేదిక ఆధారంగానైనా బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే సింగూరు రిజర్వాయర్ భద్రతకు ముప్పు వాటిల్లుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

న్యూస్ నెట్‌వర్క్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి, మెదక్ జిల్లాలో మహిళలు శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఇంటింటా మహిళలు లక్ష్మీదేవి చిత్రపటాలను వివిధ రకాల పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముత్తైదువులు ఒకరికొకరు పసుపు, కుంకుమ, పండ్లు వాయినంగా ఇచ్చిపుచ్చుకున్నారు. గుమ్మడిదలలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం, పెద్దశంకరంపేటలోని శ్రీ సరస్వతి శిశుమందిర్, తూప్రాన్ పట్టణంలోని గీతా మందిరం తదితర ప్రాంతాల్లో సామూహికంగా కుంకుమార్చనలు, వ్రతాలు నిర్వహించారు. చిలప్‌చెడ్, రామచంద్రాపురం, పటాన్‌చెరు, సదాశివపేట, జహీరాబాద్, వెల్దుర్తి, చేగుంట, ఝరాసంగం తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లో మహిళలు సామూహిక వ్రతాలు చేశారు. కల్హగూర్‌లోని శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో విద్యార్థులు అష్టలక్ష్మి వేషధారణలో చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.



పెద్దశంకరంపేట శ్రీసరస్వతీ శిశుమందిర్‌లో సామూహిక వరలక్ష్మి వ్రతాలు